## మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

కేసముద్రం, అక్టోబర్ 13: మండలంలోని కేసముద్రం విలేజీ ఎన్‌టీఆర్ నగర్ కాలనీకి చెందిన గడ్డం మురళి ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ పంపిన క్వింటాల్ బియ్యాన్ని శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు అందించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం దుర్గేశ్, కముటం స్వామి, రడం చిన్న వెంకన్న, కదిర చక్రపాణి, వల్లందాసు రవి, ఉట్కూరి శ్రీను ఉన్నారు.



బియ్యం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ముర్రుపాలే బిడ్డకు శ్రేయస్కరం

గూడూరు, అక్టోబర్ 13: పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి నుంచి వచ్చే ముర్రుపాలు తాగించడం శ్రేయస్కరమని డీఎంహెచ్‌వో డాక్టర్ అంబరీశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని భూపతిపేట రైతువేదికలో అయోధ్యపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లకు 5 రోజులుగా ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పుట్టినప్పటి నుంచి రెండేండ్లలోపు పిల్లలు తీసుకునే ఆహారం గురించి, 30 ఏండ్లు పైబడిన వారికి బీపీ, షుగర్ తదితరాల గురించి ప్రజలకు ఎలా అవగాహన కల్పించాలనేది వారికి శిక్షణ ఇచ్చారు. డాక్టర్ యమున, సీహెచ్‌వో కృష్ణార్జునరావు, లోక్యా, శ్రీనివాస్, హేమలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అంబరీశ్

## పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు

కేసముద్రం, అక్టోబర్ 13: మండలంలోని పలు పాఠశాలలు, కళాశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, వివేకానంద హైస్కూల్, శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌లో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు బతుకమ్మలతో పాఠశాలకు చేరుకొని కోలాటాలు, నృత్యాలు చేశారు. శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో రావణ వధ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అజీజ్‌బేగ్, ఎస్‌వీవీ ప్రిన్సిపాల్ రామదాసు, కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్, ఉపాధ్యాయులు స్వాతి, కొమ్మాల వెంకట్‌రెడ్డి ఉన్నారు.



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

## అధిక సాంద్రతలో సాగుతో ఎక్కువ దిగుబడి

నెల్లికుదురు, అక్టోబర్ 13: అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుతో ఎక్కువ దిగుబడిని పొందవచ్చని కేవీకే మల్యాల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మాలతి అన్నారు. మండలంలోని ఆలేరు రైతు వేదికలో శుక్రవారం రైతులకు అధిక సాంద్రతలో పత్తి సాగుపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ అధిక సాంద్రత విధానంలో సాలు సాలుకు మధ్య దూరం రెండున్నర అడుగులు ఉండాలని, మొక్క, మొక్కకు మధ్య ముప్పావు ఫీటు నుంచి ఫీట్ దూరం ఉండాలని సూచించారు. సాధారణ పద్ధతిలో ఎకరానికి 8వేల నుంచి 10వేల మొక్కలు వేస్తే ఈ పద్ధతిలో ఎకరానికి 16 నుంచి 20వేల మొక్కలు వేయవచ్చునని వివరించారు. ఉద్యానశాఖ అధికారి పామాయిల్ సాగుపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారి లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయ అధికారి నెలకుర్తి రవీందర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు కిశోర్‌బాబు, ఏఈవోలు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

### ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తనయుడు సూర్యచంద్ర



దన్నసరి గ్రామంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్ కుమారుడు సూర్యచంద్ర

కేసముద్రం, అక్టోబర్ 13: సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కుమారుడు సూర్యచంద్ర అన్నారు. మండలంలోని దన్నసరి గ్రామంలో శుక్రవారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రంలో 24గంటల ఉచిత విద్యుత్ సరఫరా అవుతున్నదని, పెట్టుబడికి ఎకరానికి రూ.10 వేలు అందిస్తున్నారని తెలిపారు. ఆడబిడ్డల పెండ్లికి కల్యాణలక్ష్మి ద్వారా రూ.1,00,116, కేసీఆర్ కిట్టు, ఆసరా పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. రైతు మృతిచెందితే బాధిత కుటుంబాలకు బీమా ద్వారా రూ.5లక్షలు అందించి కొండంత అండగా ఉంటున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్ కంపెనీలు ఏర్పాటు చేయడం వల్ల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలు అండగా ఉండాలని కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి తెలంగాణపై ఉన్న అభిమానాన్ని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఓలం చంద్రమోహన్, జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు, రాష్ట్ర నాయకులు నీలం దుర్గేశ్, సర్పంచ్ కొండ్రెడ్డి శ్రీవాణి, సింగిల్ విండో డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నజీర్ అహ్మద్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సట్ల వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు కముటం శ్రీనివాస్, వేం సంపత్‌రెడ్డి, మంకు యాకుబ్‌రెడ్డి, సుంచు సూరయ్య ఉన్నారు.

## మోడీ మాటలు నమ్మి మోసపోవద్దు

### హైకోర్ట్ రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రకుమార్

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 13: ప్రజలు మోదీ మాటలు నమ్మి మోసపోవద్దని హైకోర్ట్ రిటైర్ట్ జడ్జి చంద్రకుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పేరాల కట్టయ్య ఫంక్షన్ హాల్‌లో ప్రగతి శీల యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర 8వ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో కుల, మతాలకు అతీతంగా సమాజంపై బాధ్యయుతమైన ఆలోచనా విధానం కలిగి ఉండాలన్నారు. దేశ నిర్మాణానికి యువత శాస్త్రీయ దృక్పథంతో మెలగాలన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వం యువతకు వివిధ రంగాల్లో ఉద్యోగాలను కల్పించటం విఫలమైందన్నారు. కేవలం రైల్వే రంగంలో 2లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. కరెన్సీ నోట్లను రద్దు చేసి పేదలను ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. అంబానీ, అదానీ వంటి వారు బ్యాంకుల రుణాలను కట్టకుండా ఎగ్గొట్టినా కేంద్ర ప్రభుత్వం వారికే సపోర్ట్ చేస్తోందన్నారు. పేదలను ఇబ్బందులు పెడుతూ, కార్పొరేట్లకు అండగా ఉంటోందన్నారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న, మనోహర్ రాజ్, ఆజాద్, రాకేశ్, పైండ్ల యాకయ్య, రంగయ్య, రవి, అనిల్, సూర్యం, సత్యం, వీరన్న పాల్గొన్నారు.

## కేంద్రానికి తగిన బుద్ధిచెప్పాలి

కురవి, అక్టోబర్ 13: ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి వ్యవసాయ కార్మికులకు అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన రీతిలో బుద్ధిచెప్పాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల వెంకన్నలు అన్నారు. మండల కేంద్రంలో సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం రెండో మండల మహాసభ శుక్రవారం తురక రమేశ్ అధ్యక్షతన జరిగింది. మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా కన్నె వెంకన్న, అధ్యక్షుడిగా బస్వ కొంరయ్య, ప్రధాన కార్యదర్శిగా బత్తుల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా అప్పాల వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో పలు తీర్మానాలు చేశారు. సీపీఐ మండల కార్యదర్శి కర్నం రాజన్న, పోగుల శ్రీనివాస్‌గౌడ్, బుర్ర సమ్మయ్య, దూదికట్ల సారయ్య, నిలుగొండ నాగేశ్వర్‌రావు, మహేశ్, బూర్గుల కృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌చంద్ నాయక్

## ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

### సేవాలాల్ సేన ప్రణాళిక కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్ నాయక్

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 13: ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉంటే సమస్యలు పరిష్కారమవుతాయని సేవాలాల్ సేన ప్రణాళిక కమిటీ చైర్మన్ దరావత్ ప్రేమ్‌చంద్ నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఎల్ఐసీ ఆఫీస్ పక్కన జిల్లా అధ్యక్షుడు గుగులోత్ నందులాల్ నాయక్ అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో త్వరలో పట్టణ కేంద్రంలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సేవాలాల్ సేన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలనేది తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కార్యకర్తలతో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దరావత్ వెంకన్న, బదావత్ రాంబాబు, బాలు నాయక్, సురేశ్‌నాయక్, దిలీప్, లక్ష్మీబాయి, సుమన్, లింగన్న, మాలు, చరణ్‌నాయక్ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో సత్యనారాయణ

నెల్లికుదురు, అక్టోబర్ 12: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని సాధించాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి సమ్మెట సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సెకండియర్ విద్యార్థులు ఫస్టియర్ విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీఐఈవో మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రణాళికబద్ధంగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా బారిన పడొద్దన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ఆట పాటలు అలరింపజేశాయి. జిల్లా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.సదానందం, మహబూబాబాద్ బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిసల్ వీరేందర్, లైబ్రరీ జిల్లా అధ్యక్షుడు అశోక్, పకీరుద్దిన్, అధ్యాపకులు శ్రీనివాస్, కవిరాజ్, ప్రకాశ్‌బాబు, రఘురాం, రామ్మూర్తి, బాబు, అనిల్, యాకన్న, మహేందర్, సుధాకర్, సతీశ్, సుబాశ్, నాగేశ్వర్ రావు, స్పందన పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### సీజీఎం అశోక్‌కుమార్



కేసముద్రం సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీజీఎం అశోక్, డీఈ విజయ్

కేసముద్రం, అక్టోబర్ 13: వ్యవసాయ మోటర్లకు విద్యుత్ సరఫరాలో సమస్యలు ఏర్పడితే వెంటనే పరిష్కరించాలని ట్రాన్స్‌కో సీజీఎం అశోక్‌కుమార్ అన్నారు. మండలంలో కేసముద్రం, రంగాపురం, మహిమూద్‌పట్నం గ్రామాల్లోని సబ్‌స్టేషన్లను శుక్రవారం ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యుత్ అధికారులు రైతులకు, వినియోగదారులకు అందుబాటులో ఉండాలని సూచించారు. మోటర్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ హెచ్చు తగ్గులు ఏర్పడినప్పుడు మోటరులో సమస్యలు రావని తెలిపారు. ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించుకోవాలని సూచించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడొద్దని సూచించారు. మహబూబాబాద్ ట్రాన్స్‌కో డీఈ విజయ్, ఏడీఈలు శ్రీనివాసులు, రాధిక, ఏఈలు శశిధర్, రాజు, ప్రభాకర్, కరుణాకర్ ఉన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఫ్రెండ్స్ కో ఆపరేటివ్ సభ్యులు

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 13: ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న రామసహాయం శ్రీధర్‌రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయుడు గణపురపు వరదరాజును శుక్రవారం పట్టణంలో టీచర్స్ ఫ్రెండ్స్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సొసైటీ ప్రెసిడెంట్ వెంపటి విజయ్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పుతూ భవిష్యత్‌లోనూ అనేక అవార్డులు సాధించాలని కాంక్షించారు. శ్రీనివాస్‌రావు, వెంకట్రానర్సయ్య, నరసింహ, బాబురావు, రవికుమార్, రమేశ్ పాల్గొన్నారు.